సాక్షి నిర్మల్

మంగళవారం । 13 । మే । 2025



కల్యాణం తిలకిస్తున్న మహిళ



కల్యాణోత్సవంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తులు



పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణం తిలకిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దంపతులు

కమనీయం.. శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ రాజేశ్ మీనా



స్వామివారి కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులు

దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామ పరిసర అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. విశ్వావసు నామ సంవత్సరంలో వైశాఖ శుద్ధ చతుర్దశి సోమవారం రోజు స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్యార్చన, అగ్ని ప్రతిష్ఠ, యజ్ఞ కార్యక్రమాలు, మధ్యాహ్నం ధ్వజారోహణం, బలిహరణ, గరుడ ముద్దల కార్యక్రమాలు జరిగాయి. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథం, పల్లకిలో అలంకరించి కళ్యాణ మంటపానికి తీసుకొచ్చారు. ఖానాపూర్‌కు చెందిన వేదపండితులు శ్రీ వాసుదేవాచార్యులు, శ్రీ చక్రపాణి నరసింహమూర్తి వేదమంత్రోచ్చారణలతో కళ్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 10 వేల మంది భక్తులు తరలివచ్చి కల్యాణం తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంగూరి మహేందర్ నేతృత్వంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కళ్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ రాజేశ్‌మీనా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల్ సీఐ కృష్ణ, ఎస్‌ఐ సందీప్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. – దిలావర్‌పూర్

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

• సీనియర్ సివిల్ జడ్జి రాధిక



మాట్లాడుతున్న జడ్జి రాధిక

నిర్మల్‌టౌన్: జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జూన్ 14న నిర్వహించే లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జి.రాధిక సూచించారు. జిల్లా కేంద్రంలోని సివిల్ కోర్టులో సోమవారం మీడియాతో మాట్లాడారు. లోక్‌అదాలత్‌లో రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందులో క్రిమినల్, సివిల్, భూతగాదాలు, రోడ్డు ప్రమాదం, వివాహ, కుటుంబ తగాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని వివరించారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి ఎకరం స్థలం కేటాయించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నిర్మల్ సీఏసీఎస్ చైర్మన్ సోమా భీమ్‌రెడ్డి, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు నందెడపు చిన్ను, మండల అధ్యక్షులు భుజంగా శ్రీనివాస్‌రెడ్డి, ఓడ్నాల రాజేశ్వర్, గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, బొల్లోజి నర్సయ్య, ఏనుగు లింగారెడ్డి, కొర్వ నవీన్, ఈటల శ్రీనివాస్, కొండ శ్రీనివాస్, గాజుల రవి కుమార్ ఉన్నారు.

నేడు పాలిసెట్

నిర్మల్ రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం సాంకేతిక విద్యాశాఖ మంగళవారం పాలిసెట్ నిర్వహించనుంది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2,422 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరి కోసం జిల్లా కేంద్రంలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలుర, బాలికల జూనియర్ కళాశాలలు, వశిష్ఠ డిగ్రీ జూనియర్ కళాశాల, దీక్ష డిగ్రీ కళాశాల, సోఫీనగర్ బాలికల గురుకుల విద్యాలయంలో పరీక్ష జరుగుతుంది. ఈమేరకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్ష నిర్వహిస్తారు. నిమిషం నిబంధన అమలులో ఉంటుంది. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షకు ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, గడియారాలు తీసుకురావద్దని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి.రమేష్ సూచించారు. హాల్ టికెట్, పెన్సిల్, పెన్ను తెచ్చుకోవాలని తెలిపారు.

పాలిసెట్‌కు పటిష్ట భద్రత

నిర్మల్‌టౌన్: పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ పరీక్షకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. కేంద్రాల వద్ద అండర్ సెక్షన్ 163(పాత చట్టం 144 సెక్షన్) బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడవద్దని తెలిపారు. నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరగవద్దని పేర్కొన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు.

జీపీ కార్మికుల సమ్మె నోటీస్

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెకు మద్దతు తెలుపుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డీపీవో కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. పంచాయతీ సిబ్బందిని కూడా 2వ పీఆర్సీ పరిధిలోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జీవో 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలన్నారు. కారో బార్, బిల్ కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించి అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లు ఇవ్వాలని పేర్కొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు పెంపు

నిర్మల్‌చైన్‌గేట్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ రాయితీ గడువును ప్రభుత్వం మరోసారి పెంచినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. మొత్తం ఫీజులో 25 శాతం రాయితీతో ఈ నెల 31వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఆమోదం పొందిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

బోధనకు మెరుగులు..

• ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యత పెంపునకు చర్యలు..
• నేటి నుంచి ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి శిక్షణ
• 5 రోజులు కొనసాగనున్న తరగతులు

లక్ష్మణచాంద: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు, జిల్లా విద్యాశాఖ ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ శిక్షణ తరగతులు జిల్లా కేంద్రంలో ఈ నెల 13 నుంచి 17 వరకు నిర్వహిస్తారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని డీఈవో రామారావు ఆదేశించారు.

పాల్గొనే ఉపాధ్యాయులు

ఈ శిక్షణ కార్యక్రమంలో వివిధ విభాగాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొంటారు. వీరిలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ 112 మంది, తెలుగు స్కూల్ అసిస్టెంట్లు 184 మంది, హిందీ స్కూల్ అసిస్టెంట్లు 148 మంది, ఆంగ్లం స్కూల్ అసిస్టెంట్లు 185 మంది, గణితం స్కూల్ అసిస్టెంట్లు 189 మంది, సామాజికశాస్త్రం స్కూల్ అసిస్టెంట్లు 175 మంది, భౌతిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్లు 184 మంది, జీవశాస్త్రం స్కూల్ అసిస్టెంట్లు 162 మంది, ఫిజికల్ డైరెక్టర్లు 77 మంది, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు 47 మంది, ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్లు 55 మంది, తెలుగు మీడియం సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ) 1,077 మంది, ఉర్దూ మీడియం ఎస్‌జీటీలు 129 మంది, మరాఠీ మీడియం ఎస్‌జీటీలు 11 మంది, ఉర్దూ మీడియం స్కూల్ అసిస్టెంట్లు 78 మంది ఉన్నారు.

కేంద్రాల్లో ఏర్పాట్లు

ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని రెండు ప్రముఖ పాఠశాలల్లో నిర్వహించబడుతుంది. నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో మండల రిసోర్స్ పర్సన్స్(ఎంఆర్‌పీ), తెలుగు మీడియం ఎస్‌జీటీలు, ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్లు, ఆంగ్లం, గణితం స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ జరుగుతుంది. చాణక్య పాఠశాలలో సామాజిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్లు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఎస్‌జీటీలు,



ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ (ఐఈఆర్‌పీ)లకు శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో ఉపాధ్యాయులకు టీ, టిఫిన్, మధ్యాహ్న భోజనం అందించబడుతుంది.

జియో–ట్యాగ్ హాజరు విధానం

శిక్షణలో పాల్గొనే ఉపాధ్యాయులు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా జియో–ట్యాగింగ్ హాజరును నమోదు చేయాల్సి ఉంటుంది. శిక్షణ ఉదయం 9:30 నుంచిసాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహించబడుతుంది. శిక్షణ పూర్తయిన తర్వాత, ప్రతీ ఉపాధ్యాయుడు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ డౌన్‌లోడ్ చేసుకుని, దానిని తమ సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఈ విధానం శిక్షణ పారదర్శకతను ఉపాధ్యాయుల బాధ్యతను నిర్ధారిస్తుంది.

లక్ష్యాలు

ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను గణనీయంగా పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపాధ్యాయులు ఆధునిక బోధనా పద్ధతులను అవలంబించడం, విద్యార్థులలో విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించడం ఈ శిక్షణ యొక్క ప్రధాన ఉద్దేశాలు. అలాగే, డిజిటల్ మరియు ఏఐ ఆధారిత సాధనాల ద్వారా విద్యను సరళీకృతం చేయడం, పాఠశాలల్లో సమగ్ర అభివృద్ధిని సాధించడం కూడా ఈ కార్యక్రమం లక్ష్యంగా ఉంది.

శిక్షణ అంశాలు

ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు ఆధునిక విద్యా పద్ధతులపై సమగ్ర శిక్షణ అందించబడుతుంది. ఈ శిక్షణలో కవర్ చేయబడే ప్రధాన అంశాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

- విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం.
- ఆన్‌లైన్, డిజిటల్ సాధనాల ద్వారా బోధనా విధానాలను మెరుగుపరచడం.
- ఏఐ సాంకేతికతను విద్యా బోధనలో ఏకీకృతం చేయడం.
- విద్యార్థులలో జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం.
- పాఠ్యాంశాల ఆధారంగా నిర్దిష్ట అభ్యసన ఫలితాలను సాధించడం.
- తరగతి గదిలో ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం.
- పాఠశాలల బలోపేతం మరియు సమగ్ర అభివృద్ధి కోసం చర్యలు.

తప్పకుండా హాజరు కావాలి



జిల్లాలో ఈ నెల 13 నుంచి 17 వరకు ఐదు రోజులు నిర్వహించే శిక్షణ తరగతులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉపాధ్యాయులందరూ తప్పకుండా శిక్షణ తరగతులకు హాజరు కావాలి.శిక్షణ తీసుకుని శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేసి విద్యార్థుల్లో అభ్యసన సామార్థ్యాల పెంపునకు, పాఠశాలల పటిష్టతకు కృషి చేయాలి. – రామారావు, డీఈవో

కుంటాలను ఆదర్శంగా నిలుపుదాం

• కలెక్టర్ అభిలాష అభినవ్

కుంటాల: రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం అమలు కోసం 28 మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని, ఇందులో కుంటాల మండలాన్ని భూసమస్యలు లేని మండలంగా తీర్చిదిద్ది రాష్ట్రంలో ఆదర్శంగా నిలుపుదామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండలంలోని అంబుగామ గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో మాట్లాడారు. భూభారతి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ రైతుకు రశీదు ఇవ్వాలని ఆదేశించారు. ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో దరఖాస్తు చేసుకోని రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. వాటిని సుమోటోగా తీసుకుని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులతోపాటు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా ఇప్పటి వరకు 431 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. ఈనెల 13 నుంచి 30 వరకు ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి భూ సమస్యలు పరిష్కరిస్తాయని తెలిపారు. అనంతరం గ్రామస్తులు గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ పంచాయతీ కార్యదర్శిని రేపటిలోగా నియమించాలని ఆదేశించారు. అనంతరం కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి కార్యక్రమంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు కమల్ సింగ్, ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్, లింగమూర్తి, డీటీ నరేశ్‌గౌడ్, ఆర్ఐలు అడెల్లు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో కింద కూర్చుని మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నేలపై కూర్చుని.. ఓపికగా సమస్యలు విని..

కుంటాల: భూభారతి రెవెన్యూ సదస్సులో భాగంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మండలంలోని అంబుగామ గ్రామానికి వచ్చారు. గిరిజన మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ ఆహ్వానించారు. అనంతరం సదస్సుల్లో కలెక్టర్ నేలపై కూర్చొని ప్రజలతో మమేకమై సమస్యలను ఓపికగా విన్నారు. దరఖాస్తులు స్వీకరించారు. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఫోన్ పోతే ఆందోళన వద్దు

• ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: మొబైల్ ఫోన్ పోతే ఆందోళన వద్దని, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చెయ్యాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. https://www.ceir.gov.in/ వెబ్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకోవడం చాలా సులభమన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 52 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి, స్వాధీనం చేసుకున్న ఫోన్లను ఎస్పీ జానకీషర్మిల ప్రధాన పోలీస్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మార్కెట్‌లో చౌకగా వస్తుందని, సెకండ్ హ్యాండ్ ఫోన్‌లు కొనే ముందు సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఆ ఫోన్ ఐఎంఈఐ నంబర్ నమోదు చేసుకోవాలని తెలిపారు. సీఈఐఆర్ వెబ్సైట్ ద్వారా ఇప్పటి వరకు పోయిన 1,309 ఫోన్లు రికవరీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఐటీ కోర్, వివిధ పోలీస్ స్టేషన్‌లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.



తమ ఫోన్లు తిరిగి దక్కించుకున్న బాధితులు

సేవకు ప్రతీక ఫ్లోరెన్స్ నైటింగేల్

• జీజీహెచ్‌లో ఘనంగా నర్సుల దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: సేవకు ప్రతీక ఫ్లోరెన్స్ నైటింగేల్ అని జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్‌సింగ్ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సేవాతపనతో నర్సులు పని చేస్తున్నారని తెలిపారు. రోగుల ప్రాణాలను కాపాడడంలో వారే కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సునీల్ కుమార్ రాథోడ్, విశ్వనాథ్, గణేశ్, నర్సింగ్ సూపరింటెండెంట్ వనజ, విజయలక్ష్మి, అపర్ణ, కమలమ్మ ఆస్పత్రి సిబ్బంది, రక్త నిధి సిబ్బంది రాకేశ్ పాల్గొన్నారు.

జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో..

జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి నర్సింగ్ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించడంలో నర్సుల సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విద్యుల్లత, నర్సింగ్ పర్యవేక్షకులు ధనలక్ష్మి , విజయలక్ష్మి, వైద్యులు, నర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.



నర్సులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న సూపరింటెండెంట్

అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

• కలెక్టర్ అభిలాష అభినవ్
• ప్రజావాణిలో వినతుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని, ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టవద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, భూసమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తదితర అంశాలపై ప్రజల నుంచి 83 అర్జీలు వచ్చాయి. సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను శాఖల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇకటెలీ ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా 5 ఫోన్‌కాల్ అర్జీలు స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. దూర ప్రాంతాల ప్రజలు 91005 77132 నంబరును సంప్రదించి వాట్సాప్ ద్వారా సమస్యలు పంపవచ్చని తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

పకడ్బందీగా ప్రభుత్వ పథకాల అమలు..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం మాట్లాడుతూ త్వరగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సిద్ధం గ్రామపంచాయతీలలో లబ్ధిదారుల లిస్టు వుంచి అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను మండల స్థాయిలో త్వరితంగా పరిశీలించి బ్యాంకులకు పంపాలన్నారు. జిల్లాలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఉపాధి హామీ పనుల్లో తాగునీరు, టెంట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇటీవల రుణాల మంజూరులో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాదనకుర్తిని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయాలి



బుద్ధ జయంతిలో పాల్గొన్న నాయకులు

ఖానాపూర్: బుద్ధుడి శిష్యుడు విడిది చేసిన ఖానాపూర్ మండలం బాదనకుర్తిని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయాలని పలువురు వక్తలు కోరారు. బుద్ధపూర్ణిమ సందర్భంగా బాదనకుర్తిలోని బుద్ధుని విగ్రహం వద్ద సోమవారం వేడుకలు నిర్వహించారు. బుద్ధుని శిష్యుడు బాదనకుర్తి గ్రామంలో విడిది చేస్తూ తెలంగాణతోపాటు ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు బౌద్ధం విస్తరింపజేశారని తెలిపారు. గత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని బౌద్ధ క్షేత్రంగా మారుస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సత్యపరిశోదక్ సమాజ్, బామ్ సేఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బట్టి చెన్నయ్య, భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్ రక్షక, మాజీ సర్పంచ్ పార్శపు శ్రీనివాస్, బుద్దిస్ట్ ఇంటర్‌నేషనల్ నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షుడు మాదారపు రాములు, నాయకులు రాము, గంగన్న, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థలపై చర్య తీసుకోవాలి



మైక్రో ఫైనాన్స్ సంస్థలు లైసెన్సులు లేకున్నా అప్పులు ఇస్తూ అధిక వడ్డీ వసూలు చేస్తున్నాయి. తీసుకున్న సొమ్ము చెల్లించడానికి ఒక్కరోజు లేట్ అయినా అసభ్య పదజాలంతో తిడుతున్నారు. మానసికంగా వేధిస్తూ, ఆర్థికంగా నష్టం కలిగిస్తున్నారు. లైసెన్స్ లేని సంస్థలపై చర్య తీసుకోవాలి.
– శాంతినగర్ కాలనీవాసులు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి..

మాది ఆదివాసీ తండా. కొన్నేళ్లుగా మేము వైఎస్సార్ కాలనీలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నాం. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని దరఖాస్తు కూడా చేసుకున్నాం. మా కాలనీకి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇదివరకే ఇందిరమ్మ ఇంటి లిస్టు ఫైనల్ అయిందని చెప్పారు. అందులో మా పేర్లు లేవని చెబుతున్నారు. మాకు ఇళ్లు మంజూరు చేయండి.



కూరగాయల మార్కెట్ తరలించాలి



మేము ఇందిరానగర్ కాలనీ వాసులం. పట్టణంలోని గాంధీ కూరగాయల మార్కెట్‌లో రోడ్డుపై కూరగాయలు అమ్మడంతో కాలనీలోకి రావడానికి బయటకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. మా సమస్యలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌ను మరోచోటికి తరలించాలి.

క్లుప్తంగా

అనారోగ్యం కారణంగా ఒకరు ఆత్మహత్య


వినోద్ (ఫైల్)

భైంసారూరల్: అనారోగ్యంతో బాధపడుతూ ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని వట్టోలి గ్రామానికి చెందిన జాదవ్ వినోద్ (39) రెండేళ్లుగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. అప్పటి నుంచి వ్యవసాయం, ఇతర పనులు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి పైన ఉన్న గదిలో పడుకునేందుకు వెళ్లాడు. సోమవారం ఉదయం చూసేసరికి ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

జీవితంపై విరక్తితో యువకుడు..

బేల: మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన జగ్తాప్ అభిషేక్ (24) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నాగ్‌నాథ్ తెలిపిన వివరాల మేరకు జగ్తాప్ అభిషేక్ కొంతకాలంగా డీజే సౌండ్స్‌కు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. అందుకు యువతి నిరాకరించడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి జగ్తాప్ సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం కోల్పోయి వృద్ధురాలు..

నర్సాపూర్(జి): మతిస్థిమితం కోల్పోయిన వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన సట్ల భోజవ్వ (75) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయింది. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం పెద్దకుమారుడు శివయ్యతో గొడవకు దిగడంతో మందలించాడు. సోమవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి భోజవ్వ ఇంట్లో కనిపించలేదు. కుటుంబ సభ్యులు వెతకగా గ్రామ శివారులోని స్మశాన వాటిక వద్ద చెట్టుకు ఉరేసుకుని కనిపించింది. మృతురాలి చిన్న కుమారుడు సట్ల పీరాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ జలాలుద్దీన్ తెలిపారు.

రైలు కిందపడి ఒకరు బలవన్మరణం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పాత హమాలీవాడి గేటు వద్ద సోమవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి (35) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. మృతుడు 5 అడుగుల ఎత్తు, నల్లని తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు కలిగి ఉన్నాడని, బూడిదరంగు నైట్‌ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. కుడిచేతిపై జై గురుదేవ్ అని హిందీలో, టోని అని ఇంగ్లిష్‌లో పచ్చబొట్టుతో రాసి ఉందన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 8712658596, 9618689879 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

హుండీ అపహరణ

బాసర: బాసరలోని శ్రీ కేదారేశ్వర ఆలయంలోని హుండీని ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఘటన స్థలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వైర్లను కట్ చేసి హుండీని ఎత్తుకెళ్లినట్లు ఆశ్రమ నిర్వాహకులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శ్రీ కేదారేశ్వరి మాత అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మంగి రాములు మహరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని కిరాణా దుకాణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించి నల్లబెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్ తెలిపారు. పాత బస్టాండ్ సమీపంలోని రంగ గోవర్ధన్ దుకాణంలో 129 కిలోల నల్లబెల్లం, 5 కిలోల పటిక, పెర్కగూడలో రజిత వద్ద 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సిబ్బంది ఇంతియాజ్, సాయి ప్రసాద్, జమీర్, విజయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీకి యత్నం

జైపూర్: కేబుల్ చోరీకి యత్నించిన ముగ్గురు వ్యక్తులను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి తెలిపారు. మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిలో పంపు రిపేర్ నిమిత్తం స్థానిక చెక్ పోస్ట్ ముందు ఉంచిన కేబుల్‌ను ఆదివారం రాత్రి దొంగిలించేందుకు యత్నించిన దొరగారిపల్లికి చెందిన పులి భరద్వాజ్, బడుగు ప్రశాంత్, సాతుకు మల్లేశ్‌ను పట్టుకున్నట్లుగా వారు తెలిపారు.

కాలగర్భంలోకి మరో బొగ్గు గని

- ఆర్కే-6లో అడుగంటిన నిల్వలు
- జూలై నుంచి బొగ్గు ఉత్పత్తి బంద్
- 50 ఏళ్ల చరిత్ర సమాప్తం
- బదిలీలపై ఉద్యోగుల్లో ఆందోళన


ఎస్‌డీఎల్ ఉత్పత్తిలో కంపెనీ స్థాయిలో బహుమతి అందుకుంటున్న గని అధికారులు (ఫైల్)

శ్రీరాంపూర్: సింగరేణిలో మరో భూగర్భ గని కాలగర్భంలో కలిసిపోనుంది. సుదీర్ఘ చరిత్ర ఉన్న శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గని జూలై చివరిలో మూసివేయనున్నారు. బొగ్గు నిల్వలు అడుగంటడంతో గనిని మూసివేయాలని యజమాన్యం నిర్ణయించింది. రెండేళ్ల నుంచి ఈ గని మూసివేస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో చివరికి యాజమాన్యం గనిని మూసివేస్తున్నట్లు ఇటీవల అధికారికంగా ప్రకటించింది. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎక్కువ మంది కార్మికులు పనిచేసిన భూగర్భ గనిగా పేరుంది. 50 ఏళ్ల చరిత్ర గల ఈ గనిలో వేలాది మంది కార్మికులు పనిచేశారు. ఒకప్పుడు ఈ గనిలో బొగ్గు తీయడానికి 6ఏ సెక్షన్ గని కూడా ఉండేది. కాలక్రమేణా నిల్వలు అడుగంటి అండర్ గ్రౌండ్ మైనింగ్ విధానం ద్వారా 300 మీటర్ల లోతుల్లో ఉన్న బొగ్గు నిల్వలు తీయడం కష్టంగా మారడంతో దీన్ని మూసివేస్తున్నారు.

రికార్డుల పరంపర..

1975 ఏప్రిల్‌లో ప్రారంభమైన గని బొగ్గు ఉత్పత్తితో పాటు రక్షణలో కూడా రికార్డు సాధించింది. ఒకప్పుడు గనిలో 8 సీమ్‌ల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం 4, 5 సీమ్‌లు మాత్రమే నడుస్తున్నాయి. ఒకప్పుడు 3 వేల మంది కార్మికులు పనిచేయగా ప్రస్తుతం ఆసంఖ్య 686కు చేరుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ గని 2.20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. గతేడాది 1.8 లక్షల టన్నులకు గానూ 1.94 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించింది. ఎస్డీఎల్ సెక్షన్‌లో బొగ్గు ఉత్పత్తిని సాధించడంలో కంపెనీలో నంబర్ వన్‌గా మూడుసార్లు బహుమతి సాధించింది. రక్షణలో కూడా అనేక అవార్డులను సొంతం చేసుకుంది. శ్రీరాంపూర్ ఏరియాలో యూనియన్ కార్యకలాపాలు, రాజకీయ సందడి ఉన్న గనిగా పేరుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 60 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని జూలై వరకు తీసి మూసివేస్తున్నారు. తరువాత క్లోజింగ్ మెయింటనెన్స్ కింద కొద్ది రోజుల పాటు కొనసాగుతుంది.

ఉద్యోగుల్లో ఆందోళన..

గని మూసివేస్తే తమను ఎక్కడికి బదిలీ చేస్తారోనని ఇందులో పనిచేసే ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. అయితే ఇటీవల గనిపై జరిగిన స్వర్ణోత్సవాల్లో కార్మికులు ఆందోళన చెందవద్దని, వేరే ఏరియాకు బదిలీ చేయమని, ఇక్కడి ఏరియాలోనే సర్దుబాటు చేస్తామని జీఎం హామీ ఇచ్చారు. అయితే ఈ సర్దుబాటులు కూడా పూర్తి పారదర్శకంగా చేయాలని, పైరవీలకు ఆస్కారం లేకుండా సీనియారిటీ ఆధారంగా చేయాలని కోరుతున్నారు.

మెగా ఓసీపీకి అవకాశం

భవిష్యత్‌లో ఈగనిలో ఇంకా లోతుల్లో మిగిలి ఉన్న బొగ్గు నిల్వలను ఓసీపీ ద్వారా తీసే అవకాశం ఉంది. ఆర్కే న్యూటెక్ గని, దాని తరువాత ఆర్కే 5, ఆర్కే 7 గనులు మూతపడితే వాటన్నింటినీ కలిపి మెగా ఓసీపీగా చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. దీనికి ఇంకా నాలుగైదేళ్లు పడుతుందని వారు పేర్కొంటున్నారు.

మైసమ్మ ఆలయం ప్రత్యేకం

ఈ గనిలో ఉన్న మైసమ్మ ఆలయానికి ప్రత్యేకత ఉంది. మహిమ గల అమ్మవారుగా పేరుంది. ఏటా దసరాకు ఇక్కడ పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు. చుట్టుపక్కల కాలనీల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జమ్మిపూజలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకుంటారు. గని మూసివేసినా ఆలయాన్ని కొనసాగిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

గని ప్రారంభం	ఏప్రిల్ 1975
గుర్తించిన బొగ్గు నిల్వలు	29.08 మిలియన్ టన్నులు
తీయడానికి అనుకూలమైన నిల్వలు	14.78 మిలియన్ టన్నులు
ఇప్పటి వరకు తీసినవి	14.54 మిలియన్ టన్నులు
ప్రస్తుతం ఉద్యోగుల సంఖ్య	686
ఎస్డీఎల్ యంత్రాలు ప్రవేశపెట్టింది	జూన్ 7, 2006
మ్యాన్‌రైడింగ్ యంత్రం	ఆగస్టు 28, 2006
ప్రస్తుతం ఉన్న సీమ్‌లు	రెండు (4,5)
బొగ్గు క్వాలిటీ	జీ 9, జీ 11

జూలైలో క్లోజ్

ఆర్కే 6 గనిలో బొగ్గు నిల్వలు పూర్తిగా అడుగంటిపోయాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గనిని క్లోజ్ చేస్తున్నాం. ఈ ఏడాది జూన్ మాసంలో బొగ్గు ఉత్పత్తి ఆపేస్తే, జూలై చివరి నాటికి పూర్తిగా మూసివేయనున్నారు.
– ఈ.తిరుపతి, మేనేజర్

ఉద్రిక్తతకు దారితీసిన విగ్రహ ప్రతిష్టాపన


పరిస్థితిని సమీక్షిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

ముధోల్: మండలంలోని బోరిగాంలో సోమవారం బుద్ధుని విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రభుత్వ భూమిలో బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్టించడమే ఇందుకు దారి తీసింది. గ్రామంలోని హనుమాన్ విగ్రహం సమీపంలో అంబేడ్కర్ సంఘం నాయకులు బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్టించడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య తోపులాట జరగడంతో ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, సీఐలు, ఎస్సైలు సంఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను సముదాయించేందుకు ప్రయత్నించగా వినకపోవడంతో లాఠీచార్జ్ చేసి వారిని చెదరగొట్టారు. ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా ప్రతిష్టించిన విగ్రహాన్ని రెవెన్యూ అధికారులు భారీ పోలీసు భద్రత మధ్య తొలగించి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. రాళ్లదాడిలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఇరువర్గాలకు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు.

జాతర్లలో సీఆర్పీఎఫ్ జవాన్ అంత్యక్రియలు


అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్: జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచి సీఆర్పీఎఫ్ క్యాంపులో విధులు నిర్వహిస్తున్న జాతర్ల గ్రామానికి చెందిన అర్క మేఘనాథ్ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. సీఆర్పీఎఫ్ అధికారులు పార్థివదేహాన్ని సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన యువకులు జాతీయ జెండాలతో బైక్‌ర్యాలీగా జాతర్ల గ్రామానికి చేరుకున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యుల రోదనల మధ్య పోలీసు వందనంతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆదివాసీలు అన్నిరంగాల్లో ఎదగాలి

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

జన్నారం: ఆదివాసీ గిరిజనులు అన్నిరంగాల్లో ఎదగాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో ఆదివాసీ గిరిజనులకు నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణా తరగతులకు సోమవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు రాజకీయంగా వెనుకబడి ఉన్నారనే ఉద్దేశంతో వారిని క్రియాశీలకంగా ప్రోత్సహించడానికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కుమురంభీం ఆశయాలకు అనుగుణంగా ఆదివాసీ గిరిజనులు రాజకీయంగా ఎదిగి ఉన్నత పదవులు అధిరోహించి ప్రజాసేవలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఏఐసీసీ జాతీయ శిక్షణ కన్వీనర్ రాహుల్‌బల్, ట్రైకార్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య, రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ గిరిజన నాయకులు పాల్గొన్నారు.

'20న సమ్మె విజయవంతం చేయాలి'


మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

శ్రీరాంపూర్: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను సింగరేణి కార్మికులు విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు జట్టి శంకర్ రావు, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, సీఐటీయూ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కే.విశ్వనాథ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, దీనివలన కార్మిక వర్గం నిర్వీర్యం కానుందన్నారు. కార్మిక సంఘాల ఉనికిని కూడా ప్రశ్నార్థకం చేస్తుందన్నారు. దీని ప్రభావం వల్ల భవిష్యత్తులో పర్మినెంట్ ఉద్యోగులు ఉండరని, కాంట్రాక్టు కార్మికుల సైతం శ్రమదోపిడీకి గురవుతారన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, బ్రాంచి సెక్రటరీ షేక్ బాజీసైదా, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు గరిగే స్వామి, సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షుడు కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

చుక్కా రామయ్య పాఠశాలలో సావర్‌ఖేడా విద్యార్థులకు చోటు


విశ్వనాథ్


గీతా


అక్షిత


సిద్దార్థ


తుశార్

కెరమెరి: మండలంలోని సావర్‌ఖేడా పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు హైదరాబాద్‌లోని చుక్కా రామయ్య పాఠశాలలో సీటు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు కడెర్ల రంగయ్య తెలిపారు. ఆరోతరగతిలో ప్రవేశానికి ఈ నెల 5న పరీక్ష నిర్వహించగా ఆదివారం రాత్రి ఫలితాలు వెలువడ్డాయి. 20 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా విశ్వనాథ్, గీత, అక్షిత, సిద్దార్థ, తుశార్ సీటు దక్కించుకున్నారు. సదరు విద్యార్థులకు ఇంజినీరింగ్ వరకు ఉచితంగా విద్యాబోధన చేస్తారని ఆయన పేర్కొన్నారు.

విపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలి


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

జైపూర్: పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో సరిహద్దుల్లో చోటు చేసుకుంటున్న పరిణామాల దృష్ట్యా ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేలా పోలీస్, సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్టీపీపీలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్మిన్ భవన కార్యాలయంలో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ చంచల్‌సర్కార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో సీఐఎస్ఎఫ్, ఫైర్, పోలీస్ సిబ్బంది ప్రదర్శనలు నిర్వహించారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, వైద్యాధికారి రవీందర్, రక్షణాధికారి పులి సురేశ్, డీజీఎంలు అజ్మీర తుకారాం, అసిస్టెంట్ కమాండెంట్ సుధేశ్ జాఖర్, సీఐఎస్ఎఫ్, పోలీస్, సింగరేణి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఆరుగురి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: గంజాయి కేసులో సోమవారం వేర్వేరు చోట్ల ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. బాలాజీనగర్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడకు చెందిన ఖలీమొద్దీన్ అలియాస్ ఖల్లు పోలీసులను గమనించి పారిపోతుండగా పట్టుకున్నారు. అతన్ని తనిఖీ చేయగా 500 గ్రాముల గంజాయి లభించింది. కేఆర్కే కాలనీలో విక్రయించేందుకు వెళ్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మరోచోట ఐదుగురు అరెస్టు

మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రీస్ ఏరియా ప్రాంతంలో గంజాయి విక్రయించేందుకు ప్యాకింగ్ చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారిలో సంజయ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ముషారఫ్, బొక్కల్‌గూడకు చెందిన అబ్దుల్ ఫజల్, మరో బాలుడు, భుక్తాపూర్ కాలనీకి చెందిన ఎండీ ఈర్షద్, రిక్షా కాలనీకి చెందిన బాలుడు ఉన్నారు. వారి వద్ద కిలో గంజాయి లభ్యమైంది. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మరొకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న నిందితుడిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. గత నెల 28న ఆదిలాబాద్ పట్టణంలోని సీసీఐ వద్ద భుక్తాపూర్ కాలనీకి చెందిన షేక్ ఇర్ఫాన్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద 5 గ్రాముల గంజాయి లభించడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లుగా వివరించారు.

వీధికుక్కల దాడిలో 6 మేక పిల్లలు మృతి

రెబ్బెన: మండలంలోని పుంజుమేరగూడలో వీధికుక్కలు దాడి చేయడంతో గోపీచంద్‌కు చెందిన 6 మేకపిల్లలు మృతి చెందాయి. రోజు మాదిరిగా నే సోమవారం మేక పిల్లలను ఇంట్లో ఉన్న పాకలో వదిలేసి మిగిలిన మేకలను మేతకోసం తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి 6 పిల్లలు మృతిచెంది ఉన్నాయి. వాటిని పరిశీలించగా వీధికుక్కలుదాడి చేసినట్లు గుర్తించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

కారు ఢీకొని జింక మృతి

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో భైంసా-నిర్మల్ రహదారిపై సోమవారం కారు ఢీకొన్న ఘటనలో జింక మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు భైంసా నుండి నిర్మల్ వైపు వెళ్తున్న కారు తిమ్మాపూర్ గ్రామ సమీపంలో జింకను బలంగా ఢీ కొట్టడంతో మృతి చెందింది.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

బెల్లంపల్లి: పట్టణంలో ఓ పోలీసు హెడ్ కానిస్టేబుల్ పై కొందరు యువకులు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.దేవయ్య సోమవారం సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి పోలీసు కంట్రోల్ రూమ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డి.సతీశ్ ఆదివారం స్వస్థలం బెల్లంపల్లికి వచ్చాడు. ఇద్దరు చిన్నారులను బైక్‌పై ఎక్కించుకుని అశోక్‌నగర్‌లో ఉన్న ఓ షాపు వద్ద ఆగాడు. అక్కడ చిరుతిళ్లు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనం తీస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ కారు బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో సతీశ్ కారు డ్రైవర్‌ను నిలదీయగా అతనితో పాటు కారులో ఉన్న మరో ముగ్గురు యువకులు సతీశ్‌ను కర్రతో తలపై బలంగా కొట్టడంతో గాయమైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అజీమ్, రోహిత్, సుబ్బు, రోహిత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వాలీబాల్ పోటీల విజేత 'నేరడిగొండ'


బహుమతి అందుకుంటున్న నేరడిగొండ జట్టు


రన్నరప్‌గా నిలిచిన ధర్మారావుపేట జట్టు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో రెండు రోజులు నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. లీగ్ పద్ధతిలో నిర్వహించిన పోటీల్లో మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. లీగ్ దశలో సత్తా చాటిన మంచిర్యాల, ఆదిలాబాద్, నేరడిగొండ, ధర్మారావుపేట జట్లు సెమీస్‌కు చేరగా నేరడిగొండ, ధర్మారావుపేట జట్లు ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. ఫైనల్స్‌లో నేరడిగొండ -ధర్మారావుపేట జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మొదటి రెండు సెట్‌లలో తలో సెట్ గెలుపొందగా నిర్ణయాత్మక మూడో సెట్‌లో 15-8 పాయింట్లతో నేరడిగొండ జట్టు టోర్నీ విజేతగా నిలిచింది. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20 వేల నగదుతో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతి రూ.10 వేల నగదుతో పాటు వ్యక్తిగత బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిజామాబాద్ రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌బాబు, వసుధ హాస్పిటల్స్ డైరెక్టర్ ప్రశాంత్, సింగరేణి రిటైర్డ్ పీఈటీ వీరారెడ్డి, కోలిండియా వాలీబాల్ క్రీడాకారుడు రామ్మూర్తి, ఆయా పార్టీల నాయకులు పల్లె రాజు, గాండ్ల సమ్మయ్య, లక్ష్మణ్, సాగర్‌రెడ్డి, నిర్వాహకులు బెల్లం శ్రీనివాస్, దుబ్బ శ్రీనివాస్, కుమార్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

చిత్తగూడలో కొత్త కోడళ్ల భేటింగ్


భేటింగ్‌కు హాజరైన కొత్త కోడళ్లు

నార్నూర్: మండలంలోని చిత్తగూడలో తొడసం వంశస్తుల పెర్సపెన్ (పెద్ద దేవుడు) ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొడసం వంశానికి చెందిన కొత్త కోడళ్లతో భేటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కటోడ తొడసం మోతిరామ్, ఖందేవ్ ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు పటేల్, మాజీ ఎంపీపీ మెస్రం రూప్‌దేవ్, తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న మాజీ ఎంపీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాకెరలో సోయం వంశ కోడళ్ల భేటింగ్ నిర్వహించారు. సోయం వంశానికి చెందిన 86 మంది కోడళ్లు నూతన వస్త్రాలు ధరించి పూజల్లో పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామానికి చేరుకున్న మాజీ ఎంపీ సోయం బాపురావుకు గ్రామస్తులు డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి


అర్జీలు స్వీకరిస్తున్న ఏవో దామోదర స్వామి

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏవో దామోదర స్వామి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం ఫకీర్‌గుట్టకు చెందిన కవిత ఉపాధి కల్పించాలని, లక్సెట్టిపేటకు చెందిన ఆత్రం అంజలి వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందించాలని, బేల మండలం పీటగాంకు చెందిన శేషుబాయి బోర్‌వెల్ మంజూరు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఏవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్యామల, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుల మధ్య గొడవలో ఒకరు మృతి


మడిగే తరుణ్ (ఫైల్)

బజార్‌హత్నూర్: యువకుల మధ్య జరిగిన గొడవలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాల మేరకు దేగామలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు చందు, రాము, వినోద్ దొంగతనాలు చేశారని అదే గ్రామానికి చెందిన మడిగే తరుణ్(21)ప్రచారం చేశాడు. ఇదే విషయంలో సోమవారం శంకర్‌గౌడ్ చెందిన తెల్లకల్లు బట్టిలో ఉన్న తరుణ్‌ను నిలదీశారు. మాటామాట పెరగడంతో బయటకు తీసుకువచ్చి వెనుకకు తోయడంతో తరుణ్ కిందపడి మృతి చెందాడు. మృతుని తండ్రి మడిగే సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. యువకుడి మృతితో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. డీఎస్పీ జీవన్‌రెడ్డి, బోథ్, ఇచ్చోడ సీఐలు వెంకటేశ్వర్‌రావ్, భీమేష్, బోథ్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది దేగామ గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

విద్యుత్ తీగలకు తగిలి బొలెరో దగ్ధం

నర్సాపూర్(జి): వరిగడ్డి కట్టలు తీసుకువస్తున్న బొలెరో వాహనం విద్యుత్ తీగలకు తగలడంతో దగ్ధమైన సంఘటన మండలంలోని కుస్లిలో చోటు చేసుకుంది. కుస్లి గ్రామానికి చెందిన రైతు భోజరాం పటేల్ పశువుల మేత కోసం బామ్ని గ్రామం నుండి వరిగడ్డి కొనుగోలు చేసి బొలెరో వాహనంలో తీసుకువస్తుండగా విద్యుత్ తీగలు తగిలి గడ్డితోపాటు వాహనం కాలిపోయింది. గడ్డి కట్టలు కాలుతూ పక్కనే ఉన్న రామనోల్ల గంగాధర్‌కు చెందిన బైక్‌పై పడడంతో కొంతమేర కాలిపోయింది. గమనించిన స్థానికులు మంటలను ఆర్పినప్పటికీ అదుపులోకి రాలేదు. ఘటనలో సుమారు రూ.4 లక్షల విలువ గల వాహనం దగ్ధమైనట్లు బాధితుడు పేర్కొన్నాడు.